# గోపి ★

రచన :
విజయశ్రీ

(గత సంచిక తరువాయి)

గోపీతో తనూ సన్నిహితంగా ఉండేది. సబ్జెక్ట్సులో అర్థంకానివి ఏమైనా లెస్సన్స్ ఉంటే తనూ ఒకసారి పిలిపించుకొని చెప్పించుకునేది. గోపిలో ఉన్న తెలివితేటలు, చురుకుదనం, అల్లరిచిల్లర పనులు చేయకపోవడం తననూ ఆకర్షించక వుండలేకపోయాయి— అతనిగురించే ఆలోచనలు అనూరాధలో తిరుగుచున్నవి. ఊర్లో గోపీ జాడలేవి కనబడకపోయేసరికి అనూరాధ తండ్రి డాక్టర్ సలహాననుసరించి గోపి తాలూకు విషయం ఫోటోతో సహా 'నీవు కనిపించకపోయేసరికి అమ్మనీపై బెంగపెట్టుకొని మంచంపట్టింది. ఎక్కడున్నా రావల్సిందంటూ పేపరులో ప్రకటించాడు.

★ ★ ★

వారంరోజులు గడిచాయి, అనూరాధ స్థితి అలాగేవుంది. ఆరోజు సాయంత్రం తన గదిలో మంచంపై నిద్రపోతుంది, సూర్యుడు తన ఎండతో పగలంతా కసిచూసి శాంతముఖుడై ఇక సెలవాంటూ పశ్చిమకొండలమీద పరుగులు తీశాడు. పక్షులన్నీ శబ్దంచేస్తూ తమతమ గూటికి చేరుకుంటున్నాయి, గాలికి చెట్లన్నీ శీలలూపుతున్నాయి, చంద్రోదయం కావస్తుంది, మెల్లగా వస్తున్న పిల్లగాలులవల్ల నీరసించిన అనూరాధ బోముమీద ముంగురులు కదలికలతో ఏదో వింత అందంచేకూరింది.

ఇంతలో 'రాధా' అన్న పిలుపు మధురంగా వినబడ్డది అనూరాధకు. మళ్ళీ అదే పిలుపు—కళ్ళు తెరచి చూసింది. కలా? నిజమా? సందేహం కల్గింది, మరొక్కసారి 'రాధా' అన్న పిలుపురావడంతో కిటికీవైపు చూసింది. మబ్బు వీడిన చంద్రుణ్ణి చూసిన చకోరీవలె ఆనందం పొంగింది. గోపి—గోపి తన కళ్ళకు కనిపిస్తున్నాడు, కిటికీదగ్గరగా రమ్మంటూ సంజ్ఞ చేస్తూ చిన్నగా నవ్వుతున్నాడు. తన కళ్ళను తనే నమ్మలేకపోయింది.

ఎక్కడలేని జవసత్వాలు ఆమెలో కలిగాయి, మంచంమీదనుండి మెల్లగా లేచి కిటికీ దగ్గరగా వచ్చింది, సగం చిక్కిపోయిన ఆమె మోములో మునుపటిలా కళ లేకపోవడంతో గోపి ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

మెరుస్తున్న ఆ కళ్ళు తననే చూడడంతో, 'వచ్చింది నేనే—గోపిని.' అన్న గోపి పెదవులమీద చిన్నవ్వు విరిసింది.

'గోపీ! నన్ను క్షమింపూ!' బాధతో గొంతు గద్గదమైంది, అప్రయత్నంగా కళ్ళ వెంబడి ఏకధారగా కన్నీళ్ళు కురుస్తున్నవి.

'అదేం మాట అనూ! నీ వేంచేశావని?— ఎందుకలా ఏడుస్తున్నావు?'

'నేనే కదా, ఆ లెక్చరర్‌తో ఎవడో కొంటె వెధవ లవ్ లెటర్ విసిరాడే మోనను కొని అలా చెప్పాను. కాని, అది నీవు వేసినట్లు తెలిస్తే...'

'చెప్పకపోయేదానివి కదూ! అంతేనా?' నవ్వుతూ అన్నాడు గోపి.

'అయినా, నీకు కాపీ రాయటం అలవాటు లేదని నాకు తెలుసు. కాని, ఆ సమయంలో చాల తొందరపడ్డాను. అసలు అలాచేయడం

నాదే తప్పయింది' గంభీరంగా ముఖం దాల్చుతూ అన్నాడు.

'పోనీలే గోపీ! ఆ విషయాలు ఇప్పుడెందుకులే. ఇన్ని రోజులకు నీవు కనబడ్డావు —అంతేచాలు' పూర్తిగా నిట్టూర్చింది. ఎక్కడలేని సంతోషంతో పురివిప్పి ఆడింది అనురాధ.

వీధిలో ఎవరో వస్తున్నట్లు కనబడింది గోపికి. 'అమ్మ నాగురించి ఎంత బాధపడుతుందో... మళ్ళీ కలుస్తా రాధా!' అంటూ ఆ మసక వెలుతురులో ఇంటి ముఖంపట్టాడు తల్లి ఎడబాటును ఇన్నిరోజులు భరించలేకపోయాడు.

తనకోసం ఎంతగా నిరీక్షిస్తుందో తల్లి. ఎంత తల్లడిల్లుతుందో తన తల్లి మనసు. వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో ఇంటి తలుపుతట్టాడు గోపి. నులక మంచంలో మూల్గుతున్న ఆ తల్లి 'బాబూ! గోపి' అని కలవరిస్తుంది.

గోపి కళ్ళు ఆర్ద్రిమయ్యాయి 'అమ్మా! అంటూ తల్లి గుండెలమీదవాలి 'అమ్మా' గోపినమ్మ నేను—నీకొడుకును, వచ్చానమ్మా అంటూ తల్లిఒడిలో తలవుంచి బావురమని ఏడ్చాడు.

'బాబూ! వచ్చావా—ఇన్నిరోజు లెక్కడ వున్నావు?' అని తన కొడుకును దగ్గరగా తీసికొని తలనిమిరింది.

రైలుపట్టాలు చేరుకునేసరికి రైలు దాటి పోవడం, తిరిగి బ్రతుకుపై ఆశ జనించడం, ఇంటికి రాబుద్ధికాక పట్టణానికి ప్రయాణమవడం, ఒకరోజు వీధిలో నడుస్తుండగా సగం చినిగిన పేపరులో తన ఫొటోవుండి ఎక్కడున్నా రావల్సిందని ఉండడం చూసి అమ్మ ఆరోగ్యం ఎలావుందో? అమ్మను ఎలాగైనా కలుసుకోవాలన్న తపనతో ఇక్కడికి రావడం—ఏవేవో చెప్పకపోతున్నాడు: కాని ఆ అమృత హృదయం ఇవన్నీ వినిపించుకోవడం లేదు. ఆమె కోల్పోయాననుకున్న కన్న కొడుకును తిరిగి పొందగలిగిందన్న ఆనందంతప్ప మరేమీలేదు. ఆమెకు కావలసింది అంతే! అవును మరి— ప్రేమకన్న మిన్న మరోటుందా?

(17వ తరువాయి)

ఒక రసికుని వలలో చిక్కి అతడి పశువాంఛకు లొంగి గర్భిణి అయింది సుధ. తనను వివాహం చేసుకోమని ఆ రసికుని కోరి నిరాశ చెందిన సుధ, గట్టునపడ్డ చేపలా విలవిల్లాడిపోయింది. ఇంటిలో తన సోదరి, వదిన చెప్పిన మాటలు పెడచెవినపెట్టి కన్నుగానక విహరించిన ఫలితంగా మోసపోయిన అమాయకురాలు సుధ జీవితం ఏ గమ్యాన్ని చేరుకోగలిగింది చక్కని సృష్టిగా ముస్తాబైన "ఇంటిని దిద్దిన ఇల్లాలు" చిత్రం వివరించగలదు.

సుధగా సుదలు కురిపించే జయసుధ, కె. ఆర్. విజయ, సుజాత, శకుంతల, సుకుమారి, కమలహాసన్, బాలాజి, శ్రీకాంత్ మున్నగు నటీనటులందరూ నటించిన ఈ సాంఘిక చిత్రానికి మాటలు—పాటలు: ఆరుద్ర, సంగీతం: చక్రవర్తి, ఫోటో: కందస్వామి, దర్శకత్వం: ఏ. మణి. చక్కని ఫామిలీ సెంటిమెంట్ కథాగమనంగల ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీ డి. రమేష్ చంద్ర నందన చిత్ర పతాకంక్రింద రూపొందించారు. ప్రెస్ రిలేషన్స్: శ్రీకృష్ణ.

★ ★

"ప్రేమ లీలలు"

మీనా శివాను ప్రేమించి తండ్రి వద్దంటున్నా లేచివచ్చేసింది. ప్రియునిమీద మోజుతో హీరో కావాలన్న అతని కోరికకు ఆసరాగా నిల్చి—తన ఒంటిమీద నున్న నగలను సైతం ఒలిచిపెట్టింది.